మామిడి రైతు దిగాలు

- పూత రాకపోవడంతో ఆందోళన
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- దిగాలుగా కర్షకులు

అకాల వర్షాలు, చీడ పీడలతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి సంవత్సరం సాధారణంగా నవంబర్‌లో మామిడి పూత వస్తుంది. ఇప్పటివరకు పూత రాకపోవడంతో మామిడి రైతు ఆందోళన చెందుతున్నాడు. ఫిబ్రవరి, మార్చిలలో పిందెలు ఏర్పడుతుంటాయి. ఏప్రిల్, మే నెలల్లో కాయలు కోతకు వస్తుంటాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా గతేడాది తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులు.. ఈ సారి ఇంకా పూత రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.


పూత బదులు ఇగుర్లు వచ్చిన మామిడిచెట్లు

వీరబల్లి: రైతులు మామిడి తోటల పంటలపై నిరాశతో ఉన్నారు. మండలంలోని రైతులు దాదాపు 80 శాతం మంది మామిడి తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతేడాది దిగుబడి రాక ఇబ్బందులకు గురయ్యారు. ఈ సంవత్సరం నవంబర్ నెల ప్రారంభమై పదిరోజులు కావస్తున్నా పూత రావాల్సిన సమయంలో ఇగుర్లు వస్తున్నాయని రైతులు కలవర పడుతున్నారు. దీంతో పూత రావడం ఆలస్యం అవడమే కాకుండా కాపు కూడా వస్తుందో రాదో అని ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరంలో కూడా ఎరువులు, పురుగు మందులు కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారు. 50 శాతం కూడా దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాదన్నా మంచి దిగుబడి వస్తే అప్పులు తీర్చుకున్నామని ఆశతో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేశారు.

ఆందోళనలో అన్నదాత

ఈ ఏడాది కూడా పూత బదులు ఇగుర్లు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లక్షలు ఖర్చుచేసి మామిడి తోటలో దుక్కులు చేసుకొని పూత కోసం ఎదురుచూస్తున్నామని రైతులు అంటున్నారు. పంటను పురుగు నుంచి కాపాడుకోవడానికి రైతులు మందుల పిచికారీకి భారీగా వెచ్చిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. దీనికి తోడు సకాలంలో వర్షాలు కురవకపోవడంతో మామిడి రైతులను మరింత దిగాలుగా ఉన్నాడు.

బీమా లేక నష్టాలు

ప్రతి సంవత్సరం ప్రతికూల వాతావరణంతో తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులకు పంట బీమా లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో మామిడి రైతులు నష్టపోతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి తగ్గి నష్టపోతే బీమా ద్వారా రైతులకు కొంత ఊరట కలిగే అవకాశం ఉండేది. మామిడి తోటలు సాగు చేసే వారిలో అధిక శాతం కౌలు రైతులే ఉంటున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే తోటల యజమానుల నుంచి కౌలుకు తీసుకుంటారు. దీంతో వీరు ఎక్కువగా నష్టపోతున్నారు.

రైతులకు కష్టాలు తప్పవు



గత ఏడాదిలో దిగుబడి లేక పెట్టుబడి కూడా రాక చాలా ఇబ్బందులు పడ్డాము. ఈ ఏడాదైనా మంచి దిగుబడి వస్తాదనుకుంటే పూత బదులు మామిడితోటల్లో ఇగుర్లు వస్తున్నాయి. దీంతో రైతులకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పవు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– వీరనాగిరెడ్డి, రైతు, బాలసానివాళ్లపల్లి

అప్పుల ఊబిలో కూరుకుపోయాను



గత ఏడాదిలో మామిడితోటల పెంపకం కోసం రూ. 5 లక్షలు ఖర్చు చేశాను. దిగుబడి రాకపోవడంతో లక్ష రూపాయలు మాత్రమే వచ్చింది. నాలుగు లక్షల రూపాయలు నష్టపోయాను. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి బాధపడుతున్నాను.

– బాబురెడ్డి, రైతు పోలుచెన్నారెడ్డిగారిపల్లి

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం : చిన్నమండెం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో శనివారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

అక్కులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న అక్కదేవతలు

చిన్నమండెం : కార్తీక శుక్రవారం పురస్కరించుకుని మండల పరిధిలోని పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లె సమీపంలోని అక్కులమ్మ కొండపై వెలసిన అక్కులమ్మ ఆలయంలో అక్కదేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ప్రతి సోమవారం, శుక్రవారం భక్తులకు ఆనందరెడ్డి అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి యూనిట్ చెరువుకింద కురవపల్లి గ్రామ పరిధిలోని రైతు మల్లయ్య వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం వాటి నివారణ మార్గాలలో భాగంగా కషాయాలు, ద్రావణాలు, గ్రోత్ ప్రమోటర్లపై శిక్షణ ఇచ్చారు. వాటిలో భాగంగా అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రం, వావిలాకు కషాయం, దశపర్ని కసాయం, పంచగవ్య, మీనామృతం, కోడిగుడ్డు నిమ్మరం ద్రావణం సామూహికంగా తయారు చేశారు. రైతులు రసాయనిక పురుగు మందులు కాకుండా కషాయాలు ఉపయోగించుకోవాలని మండల టీం లీడ్ చందురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనూష, సెర్ప్ నుంచి సీసీలు సుఖదేవ్, ఎఫ్ఓ సీఈఓ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట: జిల్లా కలెక్టరేట్ ఎదుట సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలంటూ ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్ట ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గాలి చంద్రయ్య, ఏఐటీయూసీ కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అంబేడ్కర్ సర్కిల్ వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటల ద్వారా సాధించుకున్న సంక్షేమచట్టాన్ని గత ప్రభుత్వాలు అమలు చేయకుండా నిధులు దారి మళ్లించారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులు చాల నష్టపోయారన్నారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మహమ్మద్ హుసేన్, నరసింహా, షబ్బీర్‌బాషా, నన్నేసాహెబ్, కె. రమణ, చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మకు పూజలు


పూజలందుకున్న గంగమ్మ తల్లి

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మన్నూరు సీఐగా ఎస్ఎం అలీ

రాజంపేట: రాజంపేట మన్నూరు సీఐగా ఎస్ఎం అలీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు వీఆర్‌కు బదిలీ అయ్యారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వుల మేరకు ఎస్ఎం అలీ మన్నూరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం

వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు: సమష్టి కృషితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకుందామని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి కోరారు. శుక్రవారం గాలివీడు మండలం గోపనపల్లె గ్రామం పూజారివాండ్లపల్లెలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఏకష్టం వచ్చినా ఎల్లవేళలా తోడుగా నిలుస్తానన్నారు. పార్టీ అభివృద్ధిపై ఆయన చర్చించారు.

పరామర్శ

గాలివీడు మండలం అరవీడు గ్రామం కూర్మయ్యగారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుచున్న వార్డు సభ్యుడు పల్లపు శ్రీనివాసులు, కరిమిరెడ్డి వెంకట్రామిరెడ్డి, హనుమంతరెడ్డిని శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, సర్పంచులు ఉమాపతి రెడ్డి, కేశవ రెడ్డి, ఉమా ప్రభాకర్, రామాంజులు రెడ్డి, కృష్ణారెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ రమణా రెడ్డి, మైనారిటీ నాయకులు మహబూబ్ బాషా, అయ్యప్ప, వల్లపు నగేష్, బాబు పాల్గొన్నారు.

మండల అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి


సమావేశానికి హాజరైన మండల అధికారులు

పుల్లంపేట: పదవులు శాశ్వతం కాదని, మండల అభివృద్ధే తమ ధ్యేయమని, అధికారులందరూ అభివృద్ధికి సహకరించాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి కోరారు. శుక్రవారం పుల్లంపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 54 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఒక సర్వే నంబర్‌తో వేరువేరు ప్రాంతంతో బిగించారని, వాటిని తక్షణమే తొలగించేలా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని చెప్పారు. అనంత సముద్రం సర్వే నంబరులో 2.70 ఎకరాలు ఎస్సీలకు చెందిన భూమిని అగ్రవర్ణాల వారు ఆక్రమించుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవలేదని విమర్శించారు. తాగునీటికి సంబంధించి మండల వ్యాప్తంగా రూ. 35 లక్షల నిధులను ఖర్చు చేశామని తెలిపారు.

నిధులు మంజూరు

అనంతరం అంగన్‌వాడీ డిప్యూటీ సీడీపీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 25 అంగన్ వాడీ సెంటర్లకు మరుగుదొడ్లను నిర్మించుకోవడానికి నిధులు మంజూరయ్యాయని, పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారి సుదీప్ మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం గోకులం షెడ్డు మంజూరు చేసిందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే పాడి రైతులకు పచ్చిగడ్డిని పెంచుకునేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం ఎంపీడీఓ జయశ్రీ మాట్లాడుతూ విద్యాశాఖకు సంబంధించి సమగ్ర సర్వేలో మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీఓ తెలిపారు. విద్యాశాఖ అధికారులకు వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయశంకర్ నాయుడు, బోగా వెంకటసుబ్బమ్మ, మండల విద్యాశాఖాధికారులు నాగా తిరుమలరావు, చక్రాధర్ రాజు, మండల అధికారులు, వ్యవసాయ అధికారి శ్రీఖర్, వైద్యాధికారి డాక్టర్ మనోజ్ చంద్ర, సర్పంచ్‌లు ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, దొండ్లోపల్లి మణి, ముస్తాక్, ఎల్లయ్య,ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పంజం అమర్నాథ్‌రెడ్డి మృతి తీరనిలోటు


అమర్నాథ్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీకి చెందిన పార్టీ యువనాయకులు పంజం సందీప్‌రెడ్డి తండ్రి పంజం అమర్నాథ్‌రెడ్డి (70) మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అమర్నాథ్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అనంతరాజుపేట వెళ్లి అమర్నాథ్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ అమర్నాథ్ రెడ్డి మృతి చెందడం వారి కుటుంబానికి, పార్టీకి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో పంజం సుకుమార్ రెడ్డి, ఆర్‌వి రమణ, రమణారెడ్డి, హరికృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

నందలూరు: నందలూరు గ్రామ పంచాయతీలో వెలసిన మగ్దూం బాబా ఉరుసు ఈ నెల 9 నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నట్లు చిన్న పీఠాధిపతి హైదర్ సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా హైదర్ సాహెబ్ మాట్లాడుతూ ఈనెల 9న నిసాన్, 10న గంధం, 11న ఉరుసు, 12వ తేదిన జియరాత్ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రామాపురం: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కృపావతి తెలిపారు. మండలంలోని కుమ్మరపల్లి గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్యలు ఉన్న గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సమ్మద్ ఖాన్, మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, వీఆర్ఓ మహబూబ్‌బాషా రైతులు పాల్గొన్నారు.

స్కౌట్స్ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి


స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో మడితాటి నరసింహారెడ్డి

రామాపురం: స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఆదర్శంగా నిలవాలని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్కౌట్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ పతకాన్ని ఎరగవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలకు ఆదర్శ పాఠశాల వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకిత భావం పెంపొందడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. అంతేగాక స్కౌట్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం, ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరతాయని తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, గైడ్ కెప్టెన్లు చంద్రసేన, శివలీల, రమీజా, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించండి


ఎంపీడీఓ జవహర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

గాలివీడు : మండల కేంద్రంలోని సలాదివాండ్లపల్లి వాసుల స్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని శుక్రవారం స్థానికులు ఎంపీడీఓ జవహర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్మశాన వాటికకు ప్రహరీ గోడ లేకపోవడం వలన మండల కేంద్రంలోని వ్యర్థాలను, ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన పనికిరాని మట్టి, రాళ్లను అక్కడ వేయడంతో స్మశాన వాటిక కనుమరుగు అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రహరీకి నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు.

మామిడి సాగులో సస్యరక్షణ అవసరం


మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం: మామిడి సాగులో సస్యరక్షణ అవసరమని ఉద్యానవన అధికారి జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె, ఎస్. రాజంపేట, జ్యోతి, పొన్నవోలు గ్రామాల్లోని మామిడి రైతులకు శుక్రవారం పూత సమయంలో పాటించాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో పూత కొరకు ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలను తీసుకోవాలని సూచించారు. మామిడిలో తెగుళ్ల, పురుగుల నివారణ కోసం మెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్లు, బుప్రోఫెజన్ 1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. అంతేకాకుండా ఐసీఏఆర్, ఐఐటి చెన్నై వారి సారథ్యంలో తీసుకొచ్చిన ఎఫ్ఐబీఎస్‌ఓఎల్ టెక్నాలజీ పరిచయం చేస్తూ మామిడిలో అధిక దిగుబడుల కోసం ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని తెలిపారు. కాండం తొలుచు పురుగు నివారణ చర్యల గురించి తెలిపారు. అలాగే డ్రిప్ పరికరాలపై ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐబీఎస్‌ఓఎల్ కంపెనీ ప్రతినిధులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీనాథ్, ప్రేమ్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని అరుంధతివాడ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సహాయం చేయడం మెచ్చుకోదగ్గ విషయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీవీ రమణ, కృష్ణారెడ్డి, హరికృష్ణారెడ్డి, ఆర్‌వీ రమణ, రఘు, రవి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

రాయచోటి టౌన్ : వ్యక్తిగత పరిశుభ్రతతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రియదర్శిని విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గుడ్‌నైబర్స్ ఏపీ కోర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బి. నాగేశ్వరావు ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. వ్యక్తిగత శుభ్రతను ఎలా పాటించాలనే విషయంపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపించారు. చేతులు, ముఖం, గోళ్లు ఎలా శుభ్రం చేసుకోవాలనే విషయాలను తెలియచేశారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా సబ్బులు అందజేశారు. వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ప్రభావతి, చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ ఆఫీసర్ కౌరుని పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజ


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం మహిళలు అమ్మవారికి నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి హారతులు పట్టారు. రాహుకాల పూజలు నిర్వహించడం వలన కలిగే ఫలితాలు, విశేషాలను భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి వివరించి చెప్పారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.


భక్తులకు రాహుకాల పూజ విశేషాలను వివరిస్తున్న అర్చకుడు శంకరయ్య

భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

గాలివీడు : మండలంలో ప్రభుత్వ భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. శుక్రవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ మండల కేంద్రం పరిధిలోని ప్రభుత్వ భూ ఆక్రమణలు ఫిర్యాదులను విచారించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, వీఆర్ఓల పర్యవేక్షణలో ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కుశావతి నది సమీపంలోని సర్వే నంబర్ 496 రెవెన్యూ రికార్డుల ప్రకారం వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించిన వారికి త్వరలో నోటీసులు అందజేస్తామన్నారు. పట్టా భూముల సమస్యలను కూడా పరిశీలించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా


ఇసుక అక్రమ రవాణాకు అడ్డుగా గుండ్రాలను ఏర్పాటు చేసిన గ్రామస్తులు

ఒంటిమిట్ట: రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఒంటిమిట్ట మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి రీచ్‌కు సమీపంలో దర్జిపల్లి పెన్నానదిలో ఇటాచీలతో ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తుండగా గ్రామస్తులు, కూలీలు అడ్డుకున్నారు. అంతేకాదు దారికి అడ్డంగా గుండ్రాలను వేసి అక్రమ రవాణాను అదుపు చేశారు. అక్రమార్కులు నిబంధలను ఉల్లంఘించి ఇటాచీలతో, ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్నారు. దీంతో గ్రామస్తులు, కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక రవాణాలో ఇటాచీలను వాడుతూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు కడప ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్‌కు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉచిత ఇసుక రవాణాలో అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ రమణమ్మను వివరణ కోరగా గొల్లపల్లికి కొత్తగా ఇసుక రీచ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ కాంట్రాక్టర్‌కు ఇంకా పూర్తి అధికారాలు ఇవ్వలేదని తెలిపారు. ఇంతలోనే ఇటాచీతో ఇసుకను తరలిస్తుండటంతో వాటి తాళాలను తీసుకొని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అపార్ నమోదు చేయండి

ఓబులవారిపల్లె: విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వం, ప్రైవేటు జూనియర్ కళాశాలలో అపార్ ఐడీ కార్డులు ఆన్‌లైన్‌లో నమోదులకు ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఎంఈఓ రెడ్డయ్య పరిశీలించారు. ఎంపీడీఓ మల్‌రెడ్డి మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు వరకు అపార్ ఐడీ కార్డులను నమోదు చేయాలన్నారు.

టమాటా రైతులకు బీమా తప్పనిసరి

రాయచోటి టౌన్ : రబీ సీజన్‌లో టమాటా సాగు చేసిన రైతులు తప్పకుండా బీమా చేసుకోవాలని రాయచోటి ఉద్యానశాఖ అధికారి టి. నాగమణి సూచించారు. గురువారం ఉద్యానశాఖ కార్యాలయంలో రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల ఉద్యాన (వ్యవసాయ) సహాయకుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి డిసెంబర్ 15వ తేదీ లోగా టమాటా సాగు చేసిన రైతులు వాతావరణంలో వచ్చిన మార్పుల వలన పంట నష్టం జరిగితే అలాంటి రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందన్నారు. రైతులు రూ.1,600 చెల్లిస్తే పంట నష్టం జరిగితే వారికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.32,000 అందిస్తుందని తెలిపారు.